సాక్షి అనంతపురం

గురువారం । 5 । సెప్టెంబర్ । 2024



చీనీ టన్ను రూ.23 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.23 వేలు పలికాయి.



టమాట కిలో రూ.25

అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.25 పలికింది. కనిష్టం రూ.7, సరాసరి రూ.17 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

34.2°/23.9°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి.

న్యూస్‌రీల్

టీబీ డ్యాం కళకళ



తుంగభద్ర జలాశయం 10 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: నీటితో టీబీ డ్యాం కళకళలాడుతోంది. కర్ణాటకలోని హొస్పేట వద్ద ఉన్న జలాశయానికి ఎగువ ఉన్న తుంగా, భద్రా ప్రాజెక్టుల నుంచి వరద చేరిక కొనసాగుతుండడంతో నిండుకుండలా మారింది. జలాశయం పూర్తి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 101.773 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 1,633 అడుగుల నీటి మట్టానికి గాను 1,632 అడుగులకు నీరు చేరింది. జలాశయం ఎగువన ఉన్న మలెనాడు, అగుంబె, వర్నాడు తదితర ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో ఆ నీటితో పాటు ఎగువన ఉన్న తుంగా, భద్ర ప్రాజెక్టుల నుంచి దాదాపు 20 వేల క్యూసెక్కులు టీబీ డ్యామ్‌లో వచ్చి చేరుతున్నాయి. ఈ క్రమంలో 10 క్రస్ట్ గేట్లు ఒక అడుగు మేర ఎత్తి 19,779 క్యూసెక్కుల నీటిని నదికి వదులుతున్నారు. మరోవైపు, హెచ్చెల్సీ ఆంధ్రా సరిహద్దు 105వ కిలోమీటర్ వద్ద 1,800 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

చిక్‌జాజూరు ప్యాసింజర్ రద్దు

గుంతకల్లు: గుంతకల్లు–చిక్‌జాజూరు (07586/85) ప్యాసింజర్ రైళ్లను ఈ నెల 8 నుంచి అక్టోబర్ 6 వరకు రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఏ.శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. చిక్‌జాజూరు–రాయదుర్గం మార్గంలో జరుగుతున్న పనుల దృష్ట్యా రద్దు చేస్తున్నామన్నారు.

ఫలితాల విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) పరిధిలో జూలైలో నిర్వహించిన ఎంసీఏ, ఎంబీఏ రెండో సెమిస్టర్ (ఆర్–21) రెగ్యులర్/సప్లిమెంటరీ, (ఆర్–20), (ఆర్–17) సప్లిమెంటరీ ఫలితాలను ఆ వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ డాక్టర్ హెచ్.సుదర్శనరావు బుధవారం విడుదల చేశారు. అలాగే వర్సిటీ క్యాంపస్ కళాశాలలో జూలై, ఆగస్టులో నిర్వహించిన ఎంటెక్ రెండో సెమిస్టర్ (ఆర్–21) రెగ్యులర్ పరీక్ష ఫలితాలను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.చెన్నారెడ్డి విడుదల చేశారు.

యువకుడి ఆత్మహత్య

బెళుగుప్ప: మండలంలోని దుద్దేకుంట నివాసి హరిజన మర్రిస్వామి (21) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అవివాహితుడైన మర్రిస్వామి తన తల్లిదండ్రులు లక్ష్మీదేవి, రామాంజనేయులుతో కలసి ఉంటున్నాడు. ఆటో డ్రైవర్‌గా కుటుంబానికి చేదోడుగా ఉండేవాడు. కొన్ని రోజులుగా మూర్ఛ వ్యాధి తీవ్రత ఎక్కువ కావడంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం రాత్రి గ్రామ శివారులోని చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం అటుగా వెళ్లిన వారు విషయాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో తల్లిదండ్రులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సమరానికి సై..

అనంతలో నేటి నుంచి దులీప్ ట్రోఫీ మ్యాచులు

- తొలిసారిగా అనంతకు 60 మంది స్టార్ క్రికెటర్ల రాక
- స్పోర్ట్స్18, జియో సినిమా ద్వారా ప్రత్యక్ష ప్రసారం
- నేడు ఇండియా సీ, డీ జట్ల మధ్య మ్యాచ్



దులీప్ ట్రోఫీ మ్యాచులకు సిద్ధమైన ఆర్డీటీ స్టేడియం

అనంతపురం: దేశవాళీ క్రికెట్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే దులీప్ ట్రోఫీ క్రికెట్ మ్యాచులు గురువారం నుంచి అనంతపురంలో జరగనున్నాయి. మొత్తం ఐదు మ్యాచ్‌లు ఇక్కడ నిర్వహిస్తారు. ఇందుకు అనంత క్రీడా గ్రామం (ఆర్డీటీ స్టేడియం) సిద్ధమైంది. ఒక్కో మ్యాచ్ నాలుగు రోజుల పాటు (మల్టీడే మ్యాచ్) జరుగుతుంది. ఇండియా–సీ, డీ జట్ల మధ్య మొదటి మ్యాచ్ గురువారం ప్రారంభం కానుంది. ఇదే సమయంలో బెంగళూరు వేదికగా ఇండియా–ఏ, బీ జట్లు తలపడతాయి. అనంతరం ఈ నెల 22 వరకు నాలుగు టీమ్‌ల మధ్య మ్యాచులు అనంతపురం ఆర్డీటీ స్టేడియంలోనే జరుగుతాయి. ఇండియా–ఏ జట్టుకు శుభమన్ గిల్, ఇండియా–బీ జట్టుకు అభిమన్యు ఈశ్వరన్, ఇండియా–సీ జట్టుకు రుతురాజ్ గైక్వాడ్ , ఇండియా–డీ జట్టుకు శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నారు. అంతర్జాతీయ టోర్నీలకు విరామం వచ్చినపుడు ఫిట్‌గా ఉన్న స్పెషల్ కాంట్రాక్ట్ ఆటగాళ్లు అందరూ 'దేశవాళీ' క్రికెట్ ఆడాలని బీసీసీఐ నిబంధన విధించిన సంగతి తెలిసిందే. దీంతో స్టార్ క్రికెటర్లు అయిన శ్రేయస్ అయ్యర్, రుతురాజ్ గైక్వాడ్, రిషబ్ పంత్, శుభమన్ గిల్, కేఎల్ రాహుల్, అర్షదీప్ సింగ్ వంటి వారితోపాటు మొత్తం 60 మంది దులీప్ ట్రోఫీ మ్యాచుల్లో పాల్గొంటున్నారు. ఈ మ్యాచ్‌లన్నీ స్పోర్ట్స్ 18, జియో సినిమా ద్వారా ప్రత్యక్ష ప్రసారం కానుండడంతో అనంతకు అంతర్జాతీయ ఖ్యాతి దక్కనుంది. తొలి రోజు గురువారం ఉదయం 9:30 గంటలకు ఇండియా–సీ, డీ జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభం కానుంది. ఉదయం 8 గంటల నుంచి ప్రేక్షకులను స్టేడియంలోకి అనుమతించనున్నారు.

4 వేల మందికి ప్రత్యక్ష వీక్షణకు అవకాశం

అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్రీడా మైదానాలను అనంత క్రీడాగ్రామంలో ఆర్డీటీ అభివృద్ధి చేసింది. దీంతో దులీప్ ట్రోఫీ మ్యాచుల నిర్వహణకు అవకాశం దక్కింది. స్టేడియంలో 4 వేల మంది ప్రత్యక్షంగా వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. ఒక్క రోజు మ్యాచ్ నిర్వహణకు రూ.కోటికి పైగా నిధులను బీసీసీఐ ఖర్చు చేస్తోంది. అంతర్జాతీయ స్థాయి స్టార్ క్రికెటర్లు ప్రాతినిధ్యం వహిస్తుండడంతో భారీ భద్రత ఏర్పాట్లు చేశారు. దాదాపు 500 మంది కానిస్టేబుళ్లు, ఇద్దరు డీఎస్పీలు భద్రతా ఏర్పాట్లలో నిమగ్నం కానున్నారు. ఏర్పాట్ల పర్యవేక్షణకు 30 మంది జిల్లా స్థాయి అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించారు. మ్యాచ్‌ల వీక్షణకు వచ్చేవారి సౌకర్యార్థం మౌలిక వసతులను ఆర్డీటీ కల్పించింది.

సూర్య దుమ్మా

క్రికెట్ అభిమానులంతా స్కై గా పిలుచుకునే సూర్యకుమార్ యాదవ్ ఇండియా– సీ జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. అయితే గురువారం జరిగే మ్యాచ్‌కు అతను గైర్హాజరు కానున్నాడు. తక్కిన మ్యాచ్‌ల్లోనూ ఆడతాడా? లేదా అనే అంశంపై స్పష్టత లేదు. ఈ విషయం తెలుసుకున్న అభిమానులు నిరాశ చెందారు. సూర్యకుమార్ యాదవ్ కోసం క్యూలో నిల్చొని పాస్‌లు దక్కించుకున్నామని, అతడి ఆటతీరును ప్రత్యక్షంగా చూసే అవకాశం కల్పించాలని ఈ సందర్భంగా వారంతా కోరుతున్నారు.

నేడు తలపడే జట్లు ఇవే..

ఇండియా–సీ

రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), సాయి సుదర్శన్, రజత్ పటిదార్, అభిషేక్ పోరెల్ (వికెట్ కీపర్), బి.ఇంద్రజిత్, హార్దిక్ షోకీన్, మనవ్ సుతార్, ఉమ్రాన్ మాలిక్, వైశాఖ్ విజయ్‌కుమార్, అన్షుల్ కాంబోజ్, హిమాన్షు చౌహాన్, మయాంక్ మార్కండే, ఆర్యన్ జుయాల్ (వికెట్ కీపర్), సందీప్ వారియర్

ఇండియా–డీ

శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అథర్వ టైడ్, యష్ దూబే, దేవదత్ పడిక్కల్, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), రికీ భూయి, షరాన్స్ జైన్, అక్షర్ పటేల్, అర్షదీప్ సింగ్, ఆదిత్య థాక్రే, హర్షిత్ రాణా, తుషార్ దేశ్ పాండే, ఆకాష్ సేన్ గుప్తా, కేఎస్ భరత్(వికెట్ కీపర్), సౌరభ్ కుమార్

ఏర్పాట్లు చాలా బాగున్నాయి



మాట్లాడుతున్న శ్రేయస్, రుతురాజ్

అనంత క్రీడా గ్రామం (ఆర్డీటీ స్టేడియం)లో ఏర్పాట్లు చాలా బాగున్నాయని ఇండియా–సీ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్, ఇండియా–డీ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కితాబిచ్చారు. బుధవారం వారు ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. అండర్–16 మ్యాచులు ఇక్కడ ఆడానని, అప్పటికీ, ఇప్పటికీ చాలా తేడా ఉందని, అంతర్జాతీయ ప్రమాణాలు పాటిస్తున్నారని శ్రేయస్ అయ్యర్ అన్నాడు. జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న క్రికెటర్లు ఈ టోర్నీలో ఆడటం వల్ల యువతలో స్ఫూర్తి నింపినట్లు అవుతుందన్నాడు. దులీప్ ట్రోఫీలో పూర్తిగా మన క్రికెటర్లే ఆడతారని, దీన్ని ప్రత్యేకతగా భావించవచ్చన్నాడు. ఐపీఎల్ వంటి ఇతర టోర్నీలు అయితే విదేశీ క్రికెటర్లు సైతం ప్రాతినిధ్యం వహిస్తారన్నాడు.

మార్కెటింగ్ ఫీజు వసూళ్లలో 'అనంత' టాప్

అనంతపురం అగ్రికల్చర్: మార్కెటింగ్‌శాఖ నిర్దేశించిన ఫీజు వసూళ్లలో అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డు అగ్రస్థానంలో నిలిచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లాలోని 9 మార్కెట్ కమిటీలు, 15 చెక్‌పోస్టుల ద్వారా రూ.12.06 కోట్ల వసూళ్లు సాధించాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఆగస్టుతో ముగిసిన ఐదు నెలల కాలంలో 34 శాతం వసూళ్లతో రూ.4.13 కోట్లు వసూళ్లయ్యాయి. ఇందులో అనంతపురం మార్కెట్ యార్డుకు రూ.4.60 కోట్ల వసూళ్ల లక్ష్యం కాగా, ఇప్పటికే 50 శాతంతో రూ.2.33 కోట్లకు పైగా వసూళ్లు సాధించడం విశేషం.

నాలుగు కమిటీల్లో మరీ దారుణం

ఫీజు వసూళ్లలో గుత్తి, గుంతకల్లు, రాప్తాడు, రాయదుర్గం మార్కెట్ కమిటీలు పూర్తిగా వెనుకబడ్డాయి. రూ.29 లక్షలకు గానూ గుత్తి మార్కెట్‌యార్డు కేవలం 11 శాతంతో రూ.3.23 లక్షలు మాత్రమే సాధించింది. రాప్తాడు కూడా రూ.53 లక్షలకు గానూ 11 శాతంతో రూ.5.84 లక్షల వసూళ్లతో అట్టడుగు స్థానంలో నిలిచింది. ఆ తర్వాత రాయదుర్గం రూ.1.44 కోట్లకు గానూ 14 శాతంతో రూ.20.82 లక్షలు, గుంతకల్లు రూ.65 లక్షలకు గానూ 17 శాతంతో రూ.11 లక్షలు, శింగనమల 36 శాతం, ఉరవకొండ 30 శాతం, తాడిపత్రి 30 శాతం, కళ్యాణదుర్గం 25 శాతం వసూళ్లతో కాస్త ఫరవాలేదన్నట్లుగా ఉన్నాయి. కాగా గతేడాది ఇదే సమయానికి రూ.4.92 కోట్లు వసూలు కాగా ఈ సారి రూ.78.54 లక్షలు తక్కువగా వసూలు కావడం విశేషం. పాలక వర్గాలు లేకపోవడం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది.

ఎఫ్‌పీఓలకు చేయూతనివ్వాలి



అరటి నారతో చేసిన గృహోపకరణాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: రైతు ఉత్పత్తిదారుల సంస్థలకు (ఎఫ్‌పీఓ) చేయూతనివ్వడం ద్వారా రైతుల ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో జరిగిన జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ (డీఎంసీ) సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎఫ్‌పీఓల పని తీరును అభినందించారు.ఎఫ్‌పీఓలకు సంపూర్ణ సహకారం అందించే క్రమంలో ప్రభుత్వ ఆర్థిక సాయం అందేలా చూడాలని వ్యవసాయ, దాని అనుబంధ శాఖలు, ఉద్యాన, మార్కెటింగ్, సహకార, మత్స్య, చేనేత, నాబార్డ్, తదితర శాఖల అధికారులకు సూచించారు. సంఘాల ద్వారా తయారు చేసిన వస్తువులను ప్రదర్శించి, అమ్మకాలను ప్రోత్సహించేలా స్టాళ్లు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసిన స్టాళ్లను కలెక్టర్ పరిశీలించారు. అరటి నారతో చేసిన గృహోపకరణాలను పరిశీలించి, తయారీదారులను అభినందించారు. ఎఫ్‌పీఓలకు నాబార్డు అందించిన బొలెరో మొబైల్ వాహనాలను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, నాబార్డ్ డీడీఎం అనురాధ, జెడ్పీ సీఈఓ ఓబులమ్మ, ఉద్యాన శాఖ డీడీ నరసింహారావు, మార్కెటింగ్ ఏడీ చౌదరి, ఎల్‌డీసీఓ అరుణకుమారి, ఎల్‌డీఎం నర్సింగరావు, ఇతర అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా సిడిమాను ఉత్సవం



సిడిమానుకు యువకుడిని కట్టి తిప్పుతున్న దృశ్యం

రాయదుర్గం టౌన్: స్థానికంగా మూడు వేర్వేరు ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాల వద్ద బుధవారం సాయంత్రం సిడిమాను ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కోట మారెమ్మ, నేసేపేట దండుమారెమ్మ, కొల్లాపురమ్మ ఆలయాల వద్ద నిర్వహించిన ఈ వేడుకకు జనం పోటెత్తారు. అంతకుముందు ఆలయాల్లో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, అనధికారులు, ప్రముఖులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

వ్యక్తి బలవన్మరణం



శివ (ఫైల్)

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు నివాసి శివ (36) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... అవివాహితుడైన శివ తన కుటుంబసభ్యులతో కలసి పంపనూరులో హోటల్ నిర్వహిస్తుండేవాడు. మంగళవారం రాత్రి తమ హోటల్ పక్కన మరో హోటల్ పెట్టుకున్న వారితో గొడవ పడ్డాడు. ఆ సమయంలో శివపై ఓ మహిళ చెయ్యి చేసుకుంది. దీంతో అవమానంగా భావించిన ఆయన బుధవారం తెల్లవారుజాము 5 గంటలకు తన హోటల్ పక్కనే ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఇనుప ఖనిజం దొంగలపై చర్యలు తీసుకోండి

- సీబీఐకి మాజీ ఎమ్మెల్యే కాపు లేఖ

రాయదుర్గం: ఓబుళాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ)లో సీబీఐ సీజ్ చేసిన ఇనుప ఖనిజాన్ని దోచేస్తూ రూ.కోట్లు పోగుచేసుకుంటున్న దొంగలపై సత్వరం చర్యలు చేపట్టాలని బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మైనింగ్ లీజు ప్రాంతం నుంచి సీజ్ చేసిన ఇనుప ఖనిజాన్ని అక్రమంగా తరలించి సమీప స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీల్లో విక్రయిస్తున్నారన్నారు. సాక్ష్యాధారాలతో సహా అక్రమాలు బయటపెట్టినా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టడంలో మీనమేషాలు లెక్కించడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఇనుము తుక్కు (స్క్రాబ్) దొంగలపై కేసులు నమోదు చేశారే తప్పా? వందల లారీల్లో కొల్లగొట్టే వారిపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈ విషయాలపై తగిన ఆధారాలతో సీబీఐకి లేఖ రాసినట్లు వివరించారు. హైకోర్టు, సుప్రీం కోర్టు దృష్టికి సైతం తీసుకెళ్తామని తెలిపారు.

ఆచార్య దేవోభవ

సందర్భం: నేడు ఉపాధ్యాయ దినోత్సవం

- భావిభారత నిర్మాతలు టీచర్లు
- సమాజంలో ఎంతో ఉన్నత స్థానం
- 63 మందికి ఉత్తమ అవార్డులు ప్రకటించిన ప్రభుత్వం
- నేడు ఆర్ట్స్ కళాశాలలో జిల్లాస్థాయి వేడుక





అనంతపురం ఎడ్యుకేషన్/కల్చరల్: 'గురువును, భగవంతుడిని ఎదురెదురుగా నిలబెడితే మొదట గురువుకే నమస్కరిస్తా' అని అంటారు ప్రఖ్యాత హిందీ కవి కబీర్‌దాసు. అజ్ఞాన తిమిరాన్ని పారదోలి సమాజ పథ నిర్దేశకులుగా జ్ఞానభిక్ష ప్రసాదించే ఉపాధ్యాయులకు మన వ్యవస్థలో ఎంతో పవిత్ర స్థానం కట్టబెట్టారు. ఈ క్రమంలో గురువు స్థానానికి వన్నె తెచ్చిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఏటా సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటున్నారు. గురువారం గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించుకోవడానికి జిల్లా వాసులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

సర్వేపల్లితో 'అనంత' అనుబంధం..

జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాలకు ఎంతో ప్రత్యేకత ఉంది. వందేళ్లకు పైగా సుదీర్ఘ చరిత్ర కలిగిన ఈ కళాశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అధ్యాపకునిగా పని చేయడం విశేషం. అదేవిధంగా రెండో రోడ్డులోని ఓ అద్దె ఇంట్లో ఆయన 6 నెలల పాటు నివసించారు. స్వాతంత్ర్యానికి ముందు ఆర్ట్స్ కళాశాలలో కొంత కాలం పనిచేసిన సర్వేపల్లి.. అనంతరం స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. స్వతంత్ర భారతావనిలో తొలి ఉపరాష్ట్రపతిగా, రెండో రాష్ట్రపతిగా పనిచేసి మన్ననలు అందుకున్నారు.


'సారీ రాలేకపోతున్నా..'

జిల్లాకు చెందిన తొలి రాజ్యసభ సభ్యుడు రహంతుల్లాకు సర్వేపల్లితో ప్రత్యేక అనుబంధముండేది. 1957 అక్టోబరు 24న అప్పట్లో ఉపరాష్ట్రపతిగా ఉన్న సర్వేపల్లి రాధాకృష్ణన్ జిల్లా పర్యటన ఖరారు కాగా.. రహంతుల్లా తన నివాసానికి ఆయనను ఆహ్వానిస్తూ ఉత్తరం రాశారు. అయితే అనివార్య కారణాలతో సర్వేపల్లి పర్యటన రద్దయింది. ఈ క్రమంలో రహంతుల్లాకు 'సారీ' చెబుతూ స్వయంగా లేఖ రాశారు సర్వేపల్లి రాధాకృష్ణన్. ఇది నేటికీ రహంతుల్లా కుమారుడు కేఎం షఫీవుల్లా వద్ద భద్రంగా ఉండడం విశేషం.

63 మంది టీచర్లకు ఉత్తమ అవార్డులు

గురుపూజోత్సవం సందర్భంగా ప్రభుత్వం జిల్లాలో 63 మందికి ఉత్తమ టీచర్ అవార్డులు ప్రకటించింది. గురువారం ఆర్ట్స్ కళాశాలలో జరిగే జిల్లాస్థాయి గురుపూజోత్సవంలో ప్రజాప్రతినిధులు, అధికారుల చేతుల మీదుగా అవార్డులు అందజేయనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మీ తెలిపారు.

బాధ్యత పెంచింది



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు నాపై మరింత బాధ్యత పెంచింది. విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో అంతే స్థాయిలో వ్యాయామం కూడా అవసరం. అందుకే క్రీడల పట్ల అవగాహన కల్పిస్తున్నా. చిన్నగ్రామమైన కొర్రపాడు విద్యార్థులను స్విమ్మింగ్ క్రీడలో రాష్ట్రస్థాయికి తీసుకెళ్లా. విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా శిక్షణనివ్వడమే లక్ష్యం.

– నిరంజన్‌రెడ్డి, పీడీ, కొర్రపాడు జెడ్పీఉన్నత పాఠశాల, తాడిపత్రి

సంతోషంగా ఉంది



అవార్డుకు ఎంపిక కావడం సంతోషంగా ఉంది. విద్యార్థులకు ఉత్తమ బోధన అందించడంతో పాటు నిత్యం వారిని సేవా కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తున్నా. తల్లిదండ్రులతో ప్రత్యేకంగా సమావేశమై పిల్లల భవిష్యత్తు గురించి చర్చిస్తున్నా. భర్త ప్రోత్సాహంతో విద్యార్థులకు చదువుతో పాటూ ఇతర వసతులు కల్పిస్తున్నా.

– నీలం ప్రిస్కిల్లా, తెలుగు టీచర్, పామిడి జెడ్పీ ఉన్నత పాఠశాల

ఉత్తమ టీచర్ల ఎంపికలో ఇష్టారాజ్యం..

అనంతపురం ఎడ్యుకేషన్: 'ఉత్తమ టీచర్ల' ఎంపికలో ఇష్టారాజ్యంగా వ్యవహరించినట్లు తెలిసింది. బయటకేమో పారదర్శకత అంటున్నా ఆచరణలో పైరవీలకు పెద్దపీట వేశారు. అసలు దరఖాస్తే చేసుకోని టీచర్లను కూడా జాబితాలో చేర్చడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాప్రతినిధులు చెప్పారంటూ బలవంతంగా కొందరి పేర్లు చేర్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకే బుధవారం ఉదయానికి 45 మందితో ఉన్న జాబితా.. సాయంత్రం కల్లా 63కు పెరిగినట్లు తెలిసింది. డీఈఓతో పాటు మరో ముగ్గురు కూర్చుని ఈ తతంగం నడిపినట్లు తెలిసింది.

కొత్త సంప్రదాయానికి తెర : బోధనలో వినూత్నమైన అంశాలతో పిల్లల మదిని గెలుచుకున్నవారికి ఇచ్చే అవార్డుల ఎంపికలో ఈసారి జిల్లా విద్యాశాఖ అధికారులు కొత్త సంప్రదాయానికి తెర తీశారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఎంఈఓలను ఉత్తమ టీచర్ అవార్డులకు ఎంపిక చేశారు. అధికారులు టీచర్లు ఎలా అవుతారు? వారు ఎంఈఓలయిన తర్వాత ఎక్కడ బోధిస్తున్నారని ఉపాధ్యాయులు అడుగుతున్న ప్రశ్నకు డీఈఓనే సమాధానం చెప్పాలి.

అంతా గోప్యమే.. : జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు జాబితా తయారీలో అంతా గోప్యమే. కనీసం 24 గంటల ముందు జాబితా ఖరారు కాని దుస్థితి. ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు ఉదయం నుంచి జాబితా కోసం ఎదురు చూడగా.. బుధవారం సాయంత్రం 5.30 గంటలకు ప్రకటించారు. అప్పటికప్పుడు జాబితాలోని టీచర్లకు ఫోన్లు చేయడం ప్రారంభించారు. గురువారం ఉదయమే జిల్లా కేంద్రానికి రావాలని సూచించారు. ఈ క్రమంలో జిల్లా స్థాయి అధికారులపై ఉపాధ్యాయ సంఘాల నాయకులు మండిపడ్డారు. ఇంత హడావుడిగా చెప్పడం సరికాదని, కనీసం ఒకరోజు ముందు చెబితే ఎవరికీ ఇబ్బంది ఉండేది కాదని పేర్కొన్నారు.

పునరాలోచించాలి.. : సేవలను పరిగణనలోకి తీసుకోకుండా ఎవరో ఒకరిద్దరు ఇచ్చిన సలహాలను తీసుకుని కొందరిని ఎలా ఎంపిక చేస్తారంటూ ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, గుమ్మఘట్ట ఎంఈఓ–2 రామచంద్ర మండిపడ్డారు. మహిళా ఉపాధ్యాయినుల పట్ల దురుసుగా ప్రవర్తించిన వారిని, ఎస్సీ,ఎస్టీ టీచర్లను అవమానకరంగా మాట్లాడిన వారిని, అసలు దరఖాస్తు చేసుకోని వారిని ఏ అర్హతతో ఎంపిక చేశారని ఆయన నిలదీశారు. విద్యాశాఖ అధికారులు పునరాలోచించాలని కోరారు. నిజాయితీగా పని చేసిన వారిని ఎంపిక చేయకపోవడం దారుణమని పేర్కొన్నారు.

క్లుప్తంగా

14న జాతీయ లోక్‌అదాలత్



బ్యాంకు అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా జడ్జి జి. శ్రీనివాస్

అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అన్ని కోర్టుల్లో ఈ నెల 14న జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా ప్రిన్సిపల్ జడ్జి జి. శ్రీనివాస్ తెలిపారు. అన్ని కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న మోటార్ వాహనాల ప్రమాద కేసులు, సివిల్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, కుటుంబ తగాదాలు (విడాకుల కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, రాజీ చేయదగ్గ క్రిమినల్ కేసులు , ప్రిలిటిగేషన్ కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేయనున్నట్లు పేర్కొన్నారు. కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి. శివ ప్రసాద్ యాదవ్ పాల్గొన్నారు.

మట్టి విగ్రహాల తయారీ పోటీలు

అనంతపురం టౌన్: ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఈనెల 6న చిన్నారులకు మట్టి గణపతుల తయారీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ ఈఈ కిషోర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు స్థానిక శారదా మునిసిపల్ హైస్కూల్‌లో పోటీలుంటాయని 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు పోటీలో పాల్గొనవచ్చన్నారు.

రామగిరి ఎస్‌ఐగా సుధాకర్ యాదవ్



రామగిరి: మండలం ఎస్‌ఐగా సుధాకర్‌యాదవ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గత సార్వత్రిక ఎన్నికల అనంతరం ఇక్కడ ఎస్‌ఐగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు మెడికల్ లీవ్‌పై వెళ్లగా, రెండు నెలలుగా రామగిరికి ఎస్‌ఐ లేరు. వీఆర్‌లో ఉన్న సుధాకర్‌యాదవ్ రామగిరి ఎస్‌ఐగా బుధవారం బాధ్యతలు చేపట్టారు.

దోమల నియంత్రణకు చర్యలు



అనంతపురం నగరంలో పర్యటిస్తున్న జోనల్ మలేరియా అధికారి కే లక్ష్మానాయక్

అనంతపురం మెడికల్: జిల్లాలో దోమల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం డ్రైడే, యాంటీ లార్వా పద్ధతులను పాటించాలని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పని చేయాలని ఆరోగ్యశాఖ సిబ్బందికి కడప 4 జోనల్ మలేరియా అధికారి డాక్టర్ కే లక్ష్మానాయక్ సూచించారు. బుధవారం నగరంలో దోమకాటు ప్రభావిత ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. నీటి తొట్టెలు, కుంటలను పరిశీలించి, రోజుల తరబడి ఉన్న నీరును పారేసేలా చర్యలు తీసుకున్నారు.

'ఏకో'దంతుడికి జై

భక్తుల చేత పూజలు అందుకునేందుకు పార్వతీనందుడు రానున్నాడు. వినాయక చవితిని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా వాడవాడలా గణనాథుడిని కొలువుదీర్చేందుకు సన్నాహాలు ఊపందుకున్నాయి. అయితే గతంలో కంటే భిన్నంగా ఈ సారి పర్యావరణ హితకారిగా మట్టి గణపయ్యలనే కొలువుదీర్చేలా నిర్వాహకులు చర్యలు తీసుకున్నారు.

- పర్యావరణ హితం కోరుతూ వాడవాడలా మట్టి గణపతుల వితరణ

అనంతపురం కల్చరల్: వినాయక చవితి మరో రెండు రోజులుండగానే వివిధ ఆకృతుల వినాయక ప్రతిమలు పట్టణాలు, నగరాల్లో విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. కంటికి అందంగా కనిపించే ఈ విగ్రహాల తయారీలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ) వాడడం వల్ల పర్యావరణానికి పెను ప్రమాదం పొంచి ఉందని పర్యావరణ ప్రేమికులు హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో పర్యావరణ హితకారిగా ఉండే బంకమట్టి, గోమయంతో చేసిన విగ్రహాలపై ప్రజలను కొందరు సామాజిక వేత్తలు విస్తృత చైతన్య పరచడంతో పాటు ఉచితంగా మట్టి గణపయ్యలను వితరణ చేసేందుకు చర్యలు తీసుకున్నారు.



అందంగా తయారైన మట్టి గణపతులు



మట్టి గణపతికి రంగులు అద్దుతున్న దృశ్యం

పీఓపీతో పొంచి ఉన్న ప్రమాదం

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ)తో తయారు చేసే విగ్రహాల ద్వారా పర్యావరణానికి తీరని ముప్పు అని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. విగ్రహాల అలంకరణకు వాడే రసాయన రంగులు మరింత ప్రమాదకరమంటున్నారు. వీటిని నిమజ్జనం చేసిన తర్వాత నీటిని కలుషితం చేయడమే కాకుండా అనేక రకాల రోగాలకు మూలమవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీటిలో ఉండే జలచరాలు నశించి పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని అంటున్నారు. పీఓపీ విగ్రహాల తయారీలో వినియోగించే జిప్సం, గంధకం, మెగ్నీషియం, సీసం లాంటి రసాయనాలు అత్యంత ప్రమాదకరమని అంటున్నారు. ఈ మూలకాలు సాధారణంగా నీటిలో త్వరగా కరగవని, వీటి ప్రభావం మనుషులపైనే కాకుండా వృక్షాలపై, జంతువులపై కూడా అధికంగా ఉంటుందంటున్నారు. రసాయనాలు కలిసిన నీటిని వినియోగిస్తే ఊపిరితిత్తుల సమస్యలతో పాటూ చర్మ, కంటి సమస్యలు కూడా చేరి నిసత్తువ ఆవిరించేలా చేస్తాయంటున్నారు. ఈ నేపథ్యంలో పీఓపీతో చేసిన గణపయ్యలను కాకుండా మట్టితో చేసిన గణనాథుడి విగ్రహాలను పూజించాలని సూచిస్తున్నారు.

మట్టి గణపతుల తయారీపై శిక్షణ



ఈ ఏడాది మట్టి గణపతులనే వాడాలంటూ కలెక్టర్ వినోద్‌కుమార్ నేతృత్వంలో నెల రోజులుగా ప్రజల్లో విస్తృత చైతన్యం కల్పించే కార్యక్రమాలు కొనసాగిస్తూ వచ్చాం. అలాగే కాలుష్య నివారణా నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఈ నెల 6న అనంతపురంలోని మొదటిరోడ్డులో ఉన్న శారదా మున్సిపల్ హైస్కూల్‌లో మట్టి గణపతుల తయారీపై శిక్షణ ఇస్తున్నాం. మట్టిని కూడా మేమే ఉచితంగా సమకూరుస్తున్నాం.

– పీవీ కిషోర్‌రెడ్డి , ఈఈ కాలుష్య నియంత్రణా మండలి

దశాబ్దాలుగా మట్టి గణపయ్యలే



దశాబ్దాలుగా మట్టి గణపతుల తయారీ తోనే జీవనోపాధి పొందుతున్నాం. పీఓపీతో చేసిన వినాయక ప్రతిమలు ప్రత్యేక ఆకర్షణగా ఉంటుండడంతో చాలా మంది వాటిపైనే మొగ్గు చూపేవారు. ఈ క్రమంలో మా ఉపాధికి భారీగానే గండిపడుతూ వచ్చింది. దీంతో లాభాన్ని ఆశించకుండా మట్టి ప్రతిమలను తయారీని కొనసాగిస్తూ వచ్చాం.

– శ్రీనివాసులు, విగ్రహాల తయారీదారు, సోములదొడ్డి

ప్రజలు చైతన్యవంతులు కావాలి



పెద్దల సూచనతో ఐదేళ్లుగా మట్టి గణపతులను ఉచితంగా అందిస్తున్నాం. అంతేకాక పీఓపీ వినాయక ప్రతిమల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ఇంటింటా చైతన్యం తీసుకవస్తున్నాం. ప్రజలు చైతన్యవంతులు కావాలి. ఈసారి మట్టి గణపతి ప్రతిమతో పాటు పర్యావరణానికి మేలు కల్గించే మొక్కలను విరివిగా వితరణ చేస్తున్నాం.

– ఆళ్లగడ్డ రాము, ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధి, అనంతపురం

కళాత్మక ఉత్పత్తులను ప్రోత్సహిద్దాం

- కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కల్చరల్: హస్త కళాత్మక ఉత్పత్తులను అందరూ ప్రోత్సహించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. లేపాక్షి ఎంపోరియం ఆధ్వర్యంలో మూసా ఫైబ్రల్ కంపెనీ ద్వారా శిక్షణ పొందుతున్న మహిళలు తయారు చేసిన కళాత్మక వస్తువులను బుధవారం ఆయన చాంబర్‌లో తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు స్వయంశక్తిపై ఆధారపడి జీవించేలా అనేక కార్యక్రమాలున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థిక పరిపుష్టి సాధించాలని సూచించారు. కురుకుంట గ్రామంలో శిక్షణ పొందుతున్న మహిళలు ఎంతో అందమైన బ్యాగులు, అలంకరణ సామగ్రిని తయారు చేశారని అభినందించారు. వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన కంపెనీ ప్రతినిధులు శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు పండించే అరటి నారను వ్యర్థంగా పారేయకుండా దాని నుంచి ఎంతో అద్భుతమైన కళారూపాలను తయారు చేయొచ్చన్నారు. ఈ క్రమంలోనే 60 రోజుల పాటు శిక్షణ ఇస్తున్నామని, హ్యాండ్ బ్యాగులు, ఇంటీరియల్ డెకరేషన్ సామగ్రితో పాటు చీరలు కూడా అరటి నార నుంచి తయారు చేయడంలో శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో శిక్షణా శిబిరం నిర్వహిస్తున్న రెడ్స్ సంస్థ భానూజ, ట్రైనర్స్ ప్రభాకర్, మురగన్‌తో పాటూ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తాం



ముద్దలాపురంలో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

కూడేరు: ముద్దలాపురంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు నేస్తం ఫుడ్ ప్రొడ్యూసర్ కంపెనీని జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ బుధవారం సందర్శించారు. అక్కడ తయారవుతున్న స్నాక్స్ , ఆహార పదార్థాలు, పరికరాలను పరిశీలించారు. ఇక్కడ తయారవుతున్న ఆహార పదార్థాలను ఎక్కడికి ఎగుమతి చేసి విక్రయిస్తారని కలెక్టర్ ఆ కంపెనీ ప్రతినిధులతో ఆరా తీశారు. ఆర్డీటీ సహకారంతో మహిళా రైతుల పరస్పర సహకార సంఘం ఆధ్వర్యంలో ఈ ఫుడ్ ప్రొడ్యూసర్ కంపెనీ నిర్వహిస్తున్నట్లు ఆర్డీటీ ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ మల్లారెడ్డి కలెక్టర్‌కు వివరించారు. దళారి వ్యవస్థ లేకుండా రైతు పరస్పర సంఘం తరఫున వేరుశనగ ఇతర పంటల దిగుబడులను కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. మార్కెటింగ్ సదుపాయం లేక ఆశించిన స్థాయిలో అమ్మకాలు లేవని కలెక్టర్ దృష్టికి మల్లారెడ్డి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఫుడ్ ప్రొడ్యూసర్ కంపెనీ సీఈఓ మురళీ కృష్ణ, నాబార్డు డీడీఎం అనురాధ, తహసీల్దార్ మహబూబ్ బాషా పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

అనంతపురం: నగరంలో అశోక్‌నగర్‌లోని చర్చి వద్ద బుధవారం కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వై.ప్రతాప్‌రెడ్డి అదుపులోకి తీసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ తెలిపారు. అతని వద్ద నుంచి 98 విస్కీ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

కార్యదర్శుల సస్పెన్షన్‌కు రంగం సిద్ధం

అనంతపురం కార్పొరేషన్: విజయవాడలో వరద సహాయక చర్యలకు గైర్హాజరైన నగరపాలక సంస్థలోని వివిధ సచివాలయాల్లో విధులు నిర్వర్తించే పది మంది శానిటేషన్ కార్యదర్శుల సస్పెన్షన్‌కు రంగం సిద్ధమైంది. బుధవారం శానిటేషన్ కార్యదర్శులు బీ మారుతీవరప్రసాద్, వై విజయకిషోర్‌రెడ్డి, కే ముత్యాలప్ప, పీ రమేష్, జీ సూర్యప్రకాష్, బీ జనార్దన్‌రాజు, ఎస్ తిప్పయస్వామి, వీ కేదార్‌నాథ్, ఎస్ తౌసిఫ్ అహమ్మద్, జానీశంకర్‌లకు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ శ్రీహరిబాబు షోకాజ్ నోటీసు జారీ చేశారు. విపత్కర పరిస్థితుల నేపథ్యంలో విజయవాడకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినా ఎందుకు హాజరుకాలేదని? నిర్లక్ష్యానికి మిమ్మల్ని ఎందుకు సస్పెండ్ చేయకూడదని చెప్పాలన్నారు.

క్రిమినల్ లా పుస్తకాల వితరణ

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం కేంద్ర గ్రంథాలయానికి క్రిమినల్ లా పుస్తకాలను న్యాయశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం. శ్రీరాములు వితరణ చేశారు. ఈ పుస్తకాలను ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత చేతుల మీదుగా ఆవిష్కరించి గ్రంథాలయానికి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం. శ్రీరాములును వీసీ అభినందించారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ జి. వెంకటనాయుడు, రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమా ప్రకటించండి

- రైతు సంఘం కార్యదర్శి చంద్రశేఖరరెడ్డి
- 25న కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా



విలేకరులతో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

అనంతపురం అర్బన్: గత ఏడాది ఖరీఫ్, రబీకి సంబంధించి పంటల బీమాను తక్షణమే ప్రకటించడంతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు రూ.20 వేల పెట్టుబడి సాయాన్ని మంజూరు చేయాలని ఏపీ రైతు సంఘం కార్యదర్శి చంద్రశేఖర రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తరిమెల నాగరాజు అధ్యక్షతన సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. రైతుల సమస్యల పరిష్కారం, ప్రభుత్వ హామీల అమలుకు గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకూ ధర్నాలు చేపట్టాలని తీర్మానించారు. అనంతరం విలేకరుల సమావేశంలో చంద్రశేఖరరెడ్డి మాట్లాడారు. మొత్తం ఎనిమిది డిమాండ్ల సాధనకు రైతులతో కలిసి ఈ నెల 9 నుంచి 23వ తేదీ వరకూ గ్రామ, మండల కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టనున్నట్లు తెలిపారు. 25న కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా ఉంటుందని, కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రైతుల మద్దతుతో భారీ మెజారిటీతో చంద్రబాబు అధికారంలోకి వచ్చారన్నారు. అయితే ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ అమలు చేయకుండా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. స్మార్ట్ మీటర్లను పగుల గొట్టాలని ప్రతిపక్షంలో ఉండగా నారాలోకేష్ పిలుపునిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వ ఒత్తిడికి తలొగ్గి వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు సిద్ధపడడం రైతులకు ద్రోహం చేయడమేనన్నారు. సమావేశంలో నాయకులు శివారెడ్డి, విరూపాక్షి, రాజారాంరెడ్డి, శ్రీనివాసులు, నల్లప్ప, సంగప్ప, పోతులయ్య, బి.చంద్రశేఖర్‌రెడ్డి, చిదంబరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలందించాలి



విజయవాడకు వెళ్తున్న కార్మికులతో మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: విజయవాడ వరద బాధితులకు ఉత్తమ సేవలందించి అనంతపురం నగర పాలక సంస్థకు మంచి పేరు తీసుకురావాలని మేయర్ వసీం కార్మికులకు సూచించారు. విజయవాడ వరద బాధితులకు సేవలందించేందుకు నగర పాలక సంస్థ నుంచి వంద మంది కార్మికులు, 20 మంది పారిశుద్ధ్య కార్యదర్శుల మంగళవారం అనంతపురం నుంచి బయలుదేరారు. ఈ సందర్భంగా కార్మికులు, కార్యదర్శులకు మేయర్ పలు సూచనలు, సలహాలిచ్చారు.

విజయవాడ వెళ్లిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: విజయవాడలో వరదల్లో చిక్కుకున్న ఇబ్బందులు పడుతున్న బాధితులకు అండగా నిలిచేందుకు స్థానిక ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు 'రెస్క్యూ ఆపరేషన్స్' కోసం వెళ్లారు. బుధవారం కళాశాల ప్రిన్సిపల్ ఏసీఆర్ దివాకర్‌రెడ్డిని కలిశారు. బాధితులను ఆదుకోవాలనే సేవా భావంతో ముందుకొచ్చిన వలంటీర్లను ప్రిన్సిపల్ అభినందించారు.

వ్యవసాయ రంగంలో వృద్ధి సాధించాలి



వికసిత్ ఆంధ్ర ప్రణాళిక కార్యక్రమంలో వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: రాబోవు ఐదేళ్లలో వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో 15 శాతం వృద్ధి రేటు (జీవీఏ) సాధించడమే లక్ష్యంగా కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు ఆయా శాఖల అధికారులు తెలిపారు. వికసిత్ ఆంధ్రా ప్రణాళిక తయారీలో భాగంగా బుధవారం స్థానిక రెవెన్యూ భవన్‌లో సమావేశం నిర్వహించారు. 15 శాతం వృద్ధి రేటు సాధించడానికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రణాళిక తయారీపై మాస్టర్ ట్రైనీ హోదాలో ఏపీఎంఐపీ పీడీ బి.రఘునాథరెడ్డి అవగాహన కల్పించారు. అధికారులు పవర్‌పాయింట్ ద్వారా ఐదేళ్లలో చేపట్టనున్న కార్యక్రమాలను వివరించారు. వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, ఉద్యానశాఖ డీడీ నరసింహారావు, పశుశాఖ జేడీ వెంకటస్వామి, ఏడీ డాక్టర్ సుబ్రహ్మణ్యం, పట్టుశాఖ అధికారి డి.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆర్టీసీ కార్గో కార్యాలయంలో బహిరంగ వేలం

అనంతపురం క్రైం: ఆర్టీసీ కార్గో కార్యాలయంలో వినియోగదారులు కొనుగోలు చేసి సరైన అడ్రస్ ఇవ్వకుండా మరిచిపోయిన వస్తువులకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ మోతీలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొన దలచిన వారు ఈ నెల 6వ తేదీ ఉదయం 10 గంటలకు కార్గో కార్యాలయానికి చేరుకోవాలని సూచించారు. మొత్తం 47 రకాల వస్తువులు ఈ బహిరంగ వేలంలో ఉంచనున్నట్లు తెలిపారు.

పౌష్టికాహారంతోనే రక్తహీనత నివారణ

రాప్తాడు: మహిళలు, బాలింతలు, గర్భిణులు, పిల్లలు రక్తహీనతకు గురికాకుండా పౌష్టికాహారం తీసుకోవాలని వైద్యాధికారి శ్రావణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరత్న సూచించారు. బుధవారం మండలంలోని గొందిరెడ్డిపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి,

పౌష్టికాహారంతో సుఖప్రసవం

రాప్తాడురూరల్: పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా గర్భిణులకు ఆరోగ్యంతో పాటు సుఖ ప్రసవం అవుతారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయశ్రీ తెలిపారు. అనంతపురం రూరల్-5 సెక్టార్ పరిధిలోని పాపం పేటలో బుధవారం ఐసీడీఎస్, వైద్య ఆరోగ్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఏఎన్ఎం సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత మట్టి వినాయకుల పంపిణీ

అనంతపురం కల్చరల్: పర్యావరణాన్ని కాపాడుకునే దిశగా గురువారం సాయంత్రం 5 గంటలకు స్థానిక పాతూరులోని దత్తాత్రేయస్వామి ఆలయంలో ఉచిత మట్టి వినాయకులను అందించనున్నారు. నగర వాసులందరూ సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు అప్పా సుధీర్ ఓ ప్రకటనలో తెలిపారు.

డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం

అనంతపురం అర్బన్: టమాట మార్కెట్‌లో ఈనెల 12 విద్యుదాఘాతంతో మరణించిన లారీ డ్రైవర్ అనిల్ సింగ్ కుటుంబానికి లారీ డ్రైవర్లు, క్లీనర్లు, వర్కర్ల సంఘం ఆర్థిక సహాయం అందించింది. బుధవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో డ్రైవర్ కుమరుడికి రూ.20 వేలును సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు పి.నారాయణ స్వామి అందజేశారు.

సబ్సిడీ ఉలవలకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

ఆత్మకూరు: ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ ఉలవలకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సుచరిత బుధవారం ఓ ప్రకనలో తెలిపారు. క్వింటా ఉలవలు సబ్సిడీతో రూ.1,740 తో అందిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రాప్ బుకింగ్ చేసుకోకుండా బీడు భూములుగా ఉన్న రైతులు మాత్రమే ఉలవలు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

జిల్లాలో చెరువులకు నీరివ్వాలి

అనంతపురం అర్బన్: నీటిపారుదల సలహా మండలి (ఐఏబీ) సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆయకట్టుతో పాటు జిల్లాలోని అన్ని చెరువులకు నీరు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం (సీపీఐ) జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సంఘం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. తుంగభద్ర జలాశయంలో పూర్తిస్థాయి నీటిమట్టం ఉండడంతో హెచ్ఎల్‌సీకి నీరు వదులుతున్నారన్నారు. ఈ కెనాల్ కింద ఉన్న రైతులు వివిధ రకాల పంటలు సాగు చేసేందుకు సిద్ధమయ్యారన్నారు. మరోవైపున హంద్రీ-నీవా నుంచి నీరు వస్తోందన్నారు. ఈ పరిస్థితుల్లో హెచ్ఎల్, హంద్రీ-నీవా నీరు వినియోగించుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఏఐబీ సమావేశం ఏర్పాటు చేసి ఏ ప్రాంతానికి ఎంత నీరు అవసరమో గుర్తించాలన్నారు. ఎక్కువ నీరు తెచ్చుకుని పీఏబీఆర్, ఎంపీఆర్, చాగల్లు రిజర్వాయర్లతో పాటు జిల్లాలోని అన్ని చెరువులు నింపేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు.

మట్టి విగ్రహాల పంపిణీ

అనంతపురం కల్చరల్: నగరంలోని శ్రీనివాసనగర్ సీతారామాంజనేయస్వామి దేవస్థానం ధర్మకర్త ఆళ్లగడ్డ రాము నేతృత్వంలో బుధవారం త్రీటౌన్ సీఐ శాంతిలాల్ చేతుల మీదుగా ఉచిత మట్టి వినాయకుల పంపిణీ జరిగింది. మాజీ కార్పొరేటర్ వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దాడుల నివారణ బాధ్యత ప్రభుత్వానిదే

అనంతపురం ఎడ్యుకేషన్: మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడుల నివారణ బాధ్యత ప్రభుత్వానిదేనని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి పేర్కొన్నారు. బుధవారం స్థానిక కేఎస్ఎన్ ప్రభుత్వ బాలికల డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో ఐద్వా ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. దేశంలో చోటు చేసుకుంటున్న మహిళలపై దాడులు అత్యాచారాలు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాలపై నిర్వహించిన సెమినార్‌కు కళాశాల విద్యార్థిని మాధురి అధ్యక్షత వహించగా డి. రమాదేవి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఐద్వా నాయకురాలు డాక్టర్ ప్రసూన, కేఎస్ఎన్ బాలికల డిగ్రీ కళాశాల అధ్యాపకులు రాజగోపాల్, అరుణ, మహిళా సంఘం నాయకురాలు కుమారి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల అభివృద్ధికి పెద్దపీట

రాప్తాడు: మహిళా సంఘాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు డీపీఎం చేయూత ఎం.సత్యనారాయణ, డీపీఎం ఫైనాన్స్ ఎం.సత్యనారాయణ తెలిపారు. బుధవారం రాప్తాడులోని జ్యోతి మండల సమాఖ్య కార్యాలయంలో జ్యోతి మండల సమాఖ్య 20వ వార్షికోత్సవ మహాసభ జరిగింది. 2023-24 సంవత్సరం ఆడిట్ నివేదిక సమర్పణ, ఆమోదం, 2024-24 సంవత్సరం భవిష్యత్ ప్రణాళిక, మహిళా సంఘాల సభ్యుల సమస్యల పరిష్కారం, ఆర్థికాభివృద్ధి, ఆర్థిక లావాదేవీలు, లాభనష్టాలపై చర్చించారు. కార్యక్రమంలో ఏజీఎం హనుమేష్ బాబు, ఏపీఎం నల్లప్ప, ఎల్‌సీసీ మల్లికార్జున, వీఓ ఓబీలు, వీఓలు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటిస్తేనే ఆరోగ్యం

ఆత్మకూరు: మనం పరిశుభ్రత పాటిస్తేనే ఆరోగ్యంగా ఉంటామని ఐసీడీఎస్ సీడీపీఓ ధనలక్ష్మి, సూపర్‌వైజర్ లావణ్య, శ్రీవాణి సూచించారు. బుధవారం మండలంలోని తలుపూరు, పి.యాలేరు గ్రామాల్లో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

రాప్తాడు: మండలంలో అన్ని గ్రామాల్లో గణేష్ ఉత్సవాలు నిర్వహించే కమిటీ సభ్యులు పోలీసుల నుంచి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సీఐ తోట వెంకట శ్రీహర్ష తెలిపారు. బుధవారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ సింగిల్ విండో విధానంలో గణేష్ ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం అనుమతులు సులభతరం చేసిందన్నారు. కమిటీ సభ్యులు 79950 95800 అనే వాట్సప్ నంబర్‌కు హాయ్ అని మెసేజ్ చేయాలన్నారు. కమిటీ సభ్యులు గణేష్ ఉత్సవ్.నెట్ అనే వెబ్‌సైట్‌లో మంటపం ఏర్పాటుకు సంబంధించిన వివరాలు నమోదు చేయాలన్నారు.

ధరల నియంత్రణలో బీజేపీ ప్రభుత్వం విఫలం

రాప్తాడు: వంద రోజుల్లో ధరలు తగ్గిస్తామని చెప్పి పదేళ్లయినా చర్యలు తీసుకోలేదని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పీట్ల రామకృష్ణ విమర్శించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీట్ల రామకృష్ణ మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకొచ్చినా నిత్యావసర ధరలు తగ్గించలేదన్నారు. 100 రోజుల్లో నిత్యవసర వస్తువుల ధరలు తగ్గిస్తామని, విదేశాలలో ఉన్న నల్లధనాన్ని రప్పిస్తామని, ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పిస్తామని చెప్పి, అధికారంలోకొచ్చిన తర్వాత హామీలన్నీ విస్మరించారని విమర్శించారు.

జ్యోతి మండల సమాఖ్య అధ్యక్షురాలిగా సుశీల

రాప్తాడు: స్థానిక జ్యోతి మండల సమాఖ్య అధ్యక్షురాలిగా ప్రసన్నాయపల్లి పంచాయతీలోని జన్మభూమి నగర్‌కు చెందిన కే.సుశీలను ఎన్నుకున్నట్లు ఏపీఎం నల్లప్ప తెలిపారు. కార్యదర్శిగా జే.స్వప్న (ప్రసన్నాయపల్లి), కోశాధికారిగా ఎస్.శివలక్ష్మీ (రాప్తాడు), ఉపాధ్యక్షురాలుగా మల్లేశ్వరి (గాండ్లపర్తి), సహాయ కార్యదర్శిగా మణి (మరూరు)ని ఎన్నుకున్నారు.

పండ్ల మొక్కలు నాటే లక్ష్యం పూర్తి చేయాలి

కనగానపల్లి: ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరైన డ్రైల్యాండ్ హార్టికల్చర్‌లో పండ్లమొక్కలు నాటే లక్ష్యం త్వరితగిన పూర్తి చేయాలని ఏపీడీ వెంకటచలపతి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మండలంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులపై సమీక్షించారు. రైతుల పొలాల్లో తోటల పెంపకం, రోజువారి కూలీల హాజరు శాతంపై ఉపాధిహామీ సిబ్బందితో మాట్లాడారు. డ్రైల్యాండ్ హార్టికల్చర్ పథకం కింద 2024-25 సంవత్సరానికి కనగానపల్లి మండలంలోని 500 పైగా ఎకరాల్లో పండ్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏపీఓ వెంకటేష్ నాయక్, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.